**ఏకత్వాన్ని అభివృద్ధిపరచునదే నిజమైన విద్య**

**బాల్యమునందున పలువురితో కూడి**
**ఆట పాటలయందు ఐక్యుడగును**
**యవ్వనంబలరిన అలరు విల్తుని పోల్కి**
**కామినీ లోలుడై క్రాలుచుండు**
**అర్ధవయస్సున ఐహికంబున మున్గి**
**ద్రవ్యమార్జించుట దవిలియుండు**
**ముదిమి వచ్చినయంత మురహరి తలవక**
**అది ఇది లేదని అలమటించు**
**వివిధ దుర్వ్యసనంబులు వీడలేక**
**భక్తిమార్గంబు వెతుక ఆసక్తి లేక**
**కర్మపంకిలమున పడి క్రాలుచుండు**
**మట్టి కల్పును జన్మంబు మానవుండు**

ప్రపంచమున విద్యావంతులు కోట్లాదిమంది ఉన్నారు. చిన్నపిల్లవాడు మొదలు పెద్ద పండితుని వరకు ప్రతి ఒక్కరు చదవాలి, చదవాలని ఆశిస్తున్నారు. ఐతే, ఈ చదువువలన లభించే ఫలితమేమిటి? ఇది కేవలం పొట్టకూటికి మాత్రమే సహాయపడుతున్నది. కూటిపేద మొదలు కోటీశ్వరునివరకు ప్రతి ఒక్కరు ఎంత డబ్బైనా ఖర్చుపెట్టి పిల్లలను బాగా చదివించాలని ఆశిస్తున్నారు. పేదవారు అప్పైనా చేసి తమ పిల్లలను చదివిస్తున్నారు. ఇంత చేసినప్పటికీ పిల్లలు తమ తల్లిదండ్రులపట్ల కృతజ్ఞత చూపడం లేదు. "ఎవరు నన్ను చదివించి ఇంత పెద్దవానిగా చేశారు?" అనే విషయాన్ని వారు ఏమాత్రం యోచించడం లేదు.

**పుస్తకముల్ పఠించితిని పూర్తిగ చూచితి**
**సర్వ శాస్త్రముల్**
**నిస్తులమైన విద్యలను నేర్చితినంచును**
**గర్వమేల? నీ**
**హస్తయుగంబు మోడ్చి పరమాత్మను**
**భక్తితొ కొల్వలేని యీ**
**ప్రస్తుత విద్యలన్నియును పాడగు విద్యలె**
**చూడు మానవా!**

ఇన్ని పుస్తకములు చదివి, ఇన్ని విద్యలు నేర్చినప్పటికీ వీరికేమైనా శాంతి ఉన్నదా? పుస్తకములనుండి నేర్చిన విద్యలన్నియు కేవలం జీవనోపాధి నిమిత్తమే. నిజమైన విద్య ప్రతి మానవునియందు అంతర్ముఖమై యున్నది. లౌకికమైన విద్యలను అభ్యసించడంలో ఏదో గొప్పతన మున్నదని మీరనుకుంటున్నారు. కాని, ఎన్ని విద్యలు నేర్చినప్పటికీ ఈనాటి విద్యార్థులలో కించిత్తైనా విజ్ఞాన, వివేకములు కనిపించడం లేదు. తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూళ్ళకు పంపిస్తున్నారు. ఎందుకోసం పంపిస్తున్నారని ప్రశ్నిస్తే, 'ఉద్యోగంకోసం' అని జవాబు చెబుతారు. ఈ చదువులు చదివి పిల్లలేమి చేస్తున్నారు? తాము బాగుపడడం లేదు, తల్లిదండ్రులకు సహాయం చేయడం లేదు. పైగా, తాము గొప్ప విద్యావంతులమని అహంకారంతో విఱ్ఱవీగుతున్నారు.

**వినయం, వివేకం గలవారే నిజమైన విద్యావంతులు**

విద్యయొక్క విశిష్టత వినయము. అది లేకుండిన ఎన్ని విద్యలు నేర్చి ఏమి ప్రయోజనం? సమాజ సంక్షేమముకొరకు మీరు విద్యలు నేర్వాలి. కాని, ఈనాటి విద్యావంతులు సమాజమునకు ఏమైనా ఉపయోగపడుతున్నారా? సమాజమునుండి ఎంతయో నేర్చుకొని సమాజమునకు తగిన కృతజ్ఞత చూపడం లేదు. నిరక్షరాస్యులయందు కనిపించే వినయము, వివేకము ఈనాడు చదువుకున్నవారిలో కనిపించడం లేదు. ఇంతమాత్రం చదువులకే ఎందుకు విఱ్ఱవీగడం! పెద్దలను ఏవిధంగా గౌరవించాలి? సమాజంలో ఎలా మెలగాలి? సమాజసేవ ఏవిధంగా చేయాలి? అనేవి తెలుసుకోకుండా విద్యార్థులు కేవలం గ్రంథ పరిచయాన్ని

పెంచుకుంటున్నారు. ఇది 'ఆర్టిఫీషియల్' విద్య. ఈనాటి విద్యార్థుల జీవితమంతా 'ఆర్టిఫీషియల్' (కృత్రిమం)గానే ఉంటున్నది. వారు తినే తిండి, తలచే తలంపులు, చెప్పే మాటలు, చేసే పనులు అన్నీ 'ఆర్టిఫీషియల్'గానే ఉన్నవి. ఇలాంటి చదువు నేర్చు కోవడానికి కాలేజీలకు వెళ్ళవలెనా! 'నేను కాలేజీకి వచ్చినది దేనికోసం?' అని మిమ్మల్ని మీరు ప్రశ్నించు కోవాలి. అప్పుడే మీరు నిజమైన విద్యావంతులుగా రూపొందగలరు. **ఈనాటి విద్యావంతులు పుస్తకంలో ఉన్నదానిని మస్తకంలో చేర్చుకుంటున్నారు; మస్తకంలో ఉన్నదానిని పుస్తకంగా వ్రాస్తున్నారు. ఈవిధంగా పుస్తకము, మస్తకము రెండింటిమధ్య కాలాన్ని వ్యర్థం చేస్తున్నారేగాని, తాము నేర్చిన విద్యను ఆచరణలో పెట్టడం లేదు. పుస్తకముల నిండ మస్తుగా చదువుండె; మస్తకముల నిండ మట్టి మెండు!** మస్తకము పరిశుద్ధంగా లేనప్పుడు పుస్తకములు ఎన్ని చదివినా ఏమి లాభం? ఈనాడు అందరూ చదువుతున్నారు. చదువుకోసం ఎన్నో వేలు ఖర్చు పెడుతున్నారు. కాని, దీనివలన వచ్చిన ఫలితమేమిటి? చదువుకున్నవారు చేస్తున్న పని ఏమిటి? సమాజంలో ఏమైనా శాంతిని పోషిస్తున్నారా? వ్యక్తులనేమైనా చక్కదిద్దుతున్నారా? అసలు చదువుకున్నవారింట్లోనే క్రమశిక్షణ ఉండడం లేదు. పిల్లలు తల్లిదండ్రుల దగ్గర ఎంతో వినయంగా ప్రవర్తిస్తున్నారు; బయట చూస్తే పక్కా రౌడీలమాదిరి తిరుగుతున్నారు. ఇంట్లోనే కాదు, బయటకూడా పిల్లలు మంచిపేరు సంపాదించాలి.

**చెప్పినది ప్రధానం కాదు; చేసినదే ప్రధానం**

ఈనాటి విద్యార్థులు చదివే చదువంతా బయటి ప్రపంచముకోసమే! అంతర్భావమునుండి ఆవిర్భవించే ఆత్మప్రబోధమును ఎవ్వరూ లెక్కచేయడం లేదు. ఆత్మ ప్రబోధమే నిజమైన విద్య. దానిని అనుసరించకుండా ఎన్ని చదువులు చదివినా ప్రయోజనం ఉండదు. ఈనాటి విద్యావంతులు తమ ప్రభావాన్ని చూపుతూ పోతున్నారేగాని, హృదయ పవిత్రతనుగురించి ఎవ్వరూ యోచించడం లేదు. మాటలు మాత్రం మంచిగానే చెబుతున్నారు. కాని, చెప్పే మాటలను ప్రవర్తనలో చూపుతున్నారా? గ్రంథపరిచయం ఒక్కటే ప్రధానం కాదు. గ్రంథములో ఉన్న విషయాలను 'గంధము'గా మార్చుకొని హృదయానికి చేర్చుకోవాలి. విద్యార్థులు పుస్తకాలు చదువుతున్నారు; 'ఆయన ఇట్లా చెప్పాడు, ఈయన అట్లా చెప్పాడు', అని అంటున్నారు. ఇలాంటి చదువువల్ల ఏమి ప్రయోజనం? మీ హృదయము మీకు ఏమని బోధిస్తున్నదో అది మీరు చెప్పాలి. ఏ ఒక్కటైనా ఆచరణలో పెట్టి ఆదర్శం అందించాలి. **కొంతమంది గొప్ప చదువులు చదివి చూడడానికి మాత్రం 'ఛీఫ్' (గొప్పవారు)గా కనిపిస్తారు; కాని, ప్రవర్తనలో చాలా 'చీప్' (అల్పులు)గా ఉంటారు. మొట్టమొదట మీరు ఆత్మవిమర్శ చేసుకోవాలి. సచ్ఛీలాన్ని పెంపొందించు కోవాలి. శీలనిర్మాణమే విద్య పరమావధి. శీలము లేని చదువు ఉడకని అన్నమువలె నిరర్థకమైనది.** మీరు నేర్చిన విద్యలో ఏ ఒక్కటైనా ఆచరణలో పెట్టి పదిమందికి బోధించండి. మీరు చెప్పినది కాదు ప్రధానము; చేసినదే ప్రధానము. మీరు ఎక్కడికి పోయినా మంచిగా నడుచుకోండి. మీ నడత మంచిగా ఉండడమే నాకు కావలసింది. అదే నాకు ఆనందము.

**'యూనిటీ' - 'ప్యూరిటీ' - 'డివినిటీ'**

మనస్సు, బుద్ధి, ఆత్మ – ఇవి ప్రతి మనిషికి ప్రధానంగా ఉన్నటువంటి మూడు తత్త్వములు. ఆత్మ సర్వత్రా ఉంటున్నది. అట్టి ఆత్మనుగురించి ప్రబోధించే విద్యయే నిజమైన విద్య. మీరు సామాన్య మానవులు కారు; సాక్షాత్తు దైవస్వరూపులే! ఆ 'డివినిటీ' స్థాయిని చేరుకోవాలంటే మీరు ఆత్మవిద్యను అభ్యసించాలి. దానిని ఆచరణలో పెట్టి అనుభవించి, ఆనందించాలి. దివ్యత్వంతో తాదాత్మ్యం చెందడమే నిజమైన ఆనందం. ఆనందమనేది మానవునియొక్క సహజ స్వభావమే. అట్టి సహజ స్వభావాన్ని వదలిపెట్టి కృత్రిమమైన విషయాలను ఎందుకు పట్టుకోవాలి! ఈనాడు ఏ స్కూలుకి పోయి చూచినా, ఏ కాలేజీకి పోయి చూచినా విద్యార్థులు మాటలలో హీరోలుగా, అనుభవజ్ఞానంలో జీరోలుగా కనిపిస్తున్నారు. కేవలం గ్రంథపరిచయానికి మాత్రమే ప్రాధాన్యత ఇచ్చి తాముకూడా గ్రంథముల మాదిరి తయారైపోతున్నారు. నిజమైన విద్య హృదయం నుండి ఆవిర్భవిస్తుంది. ఇక్కడ హృదయమంటే 'ఫిజికల్ హార్ట్' (గుండె) కాదు. బిడ్డ పుట్టిన తక్షణమే గుండె సరిగా ఆడుతోందా లేదా అని చూస్తారు. జీవితమునకు గుండె ప్రధానమైనది. ఐతే, మనం ఆధారపడవలసింది 'ఫిజికల్ హార్ట్' మీద కాదు; 'స్పిరిచువల్ హార్ట్' (హృదయం)పై ఆధారపడాలి. హృదయానికి మరో పేరు 'కాన్షియన్స్' (అంతర్వాణి). దానిని ఆధారం చేసుకోవాలి. ప్రతి మానవునియందు నఖశిఖపర్యంతం ఆనందము తాండవమాడుచున్నది. కాని, తనయందే వున్న ఆనందమునుగూర్చి తనకే తెలియదు. అది ఎట్టి ఆనందము? **'నిత్యానందం పరమసుఖదం**

కేవలం జ్ఞానమూర్తిం ద్వంద్వాతీతం...' అది ద్వంద్వాతీతమైన ఆనందము. ద్వంద్వము ఉన్నంతవరకు ఆనందము లేదు. కనుక, మనము ద్వంద్వాతీతమైన స్థితిని పొంది 'యూనిటీ'ని గుర్తించాలి. 'యూనిటీ'వలన 'ప్యూరిటీ' కలుగుతుంది. 'ప్యూరిటీ'నుంచే 'డివినిటీ'కి పోవడానికి వీలవుతుంది. 'యూనిటీ', 'ప్యూరిటీ', 'డివినిటీ' – ఈ మూడింటియందు తన జీవితము గడిపేవాడే నిజమైన మానవుడు. ఆహార, నిద్ర, భయ, మైథునాదులను పశు, పక్షి, మృగాదులు సహితం అనుభవిస్తున్నాయి. మానవులుగా జన్మించిన మీరు మృగములమాదిరి జీవిస్తే ప్రయోజనమేమిటి? మొట్టమొదట మీరు 'యూనిటీ'ని అభివృద్ధిపరచుకోండి. అన్నదమ్ములవలె, అక్కచెల్లెళ్ళవలె ఐకమత్యంగా జీవించండి. మీటింగుల్లో వక్తలు సమావేశితులను 'బ్రదర్స్ అండ్ సిస్టర్స్' అని సంబోధిస్తుంటారు. కాని, వారు నిజంగా అందరినీ సోదరీ సోదరులుగా భావిస్తున్నారా? అసలు ఈనాడు స్వంత అన్నదమ్ములమధ్య, అక్కచెల్లెళ్ళమధ్య సహితం 'యూనిటీ' కనిపించడం లేదు. ఐకమత్యంలోనే ఆనందం ఉంది. మన జీవితమే ఒక మహా వృక్షము. బంధువులందరూ కొమ్మలు, రెమ్మలవంటివారు. దైవ చింతన, దైవభావములే ఇందులో 'ఫ్లవర్స్' (పుష్పాలు). ఆ 'ఫ్లవర్స్' నుండియే ఆనందమనే ఫలము మనకు లభిస్తుంది. ఆనందమనే ఫలమును అనుభవించకపోతే మీరు మానవులుగా పుట్టి ప్రయోజనమేమిటి!

**ప్రేమయే మీరు నేర్వవలసిన ప్రధానమైన విద్య**

విద్యార్థులారా! మీరు ప్రాపంచికమైన చదువులు కూడా చదవండి. లౌకికమైన జీవితానికి దీనిని ఆధారము చేసుకొని మీరు అంతర్ముఖమైన విద్యకు ప్రయత్నం చేయాలి. అంతర్ముఖమైన ఆధ్యాత్మిక విద్య కూడా ఉన్నప్పుడే అన్నివిధాలుగా మనకు శాంతి లభిస్తుంది. అసలు మీరు నేర్వవలసిన ప్రధానమైన విద్య ప్రేమయే. ప్రేమ లేని విద్యలు ఎన్ని నేర్చినా అవన్నీ కృత్రిమమైన విద్యలే! దేహములు వేర్వేరుకాని, దేహి ఒక్కడే. అట్టి మూలాధారమైన తత్త్వమును మనం ప్రధానంగా పెట్టుకోవాలి. అప్పుడే మనకు తగిన ఆనందము లభిస్తుంది. ఇప్పుడు చూడండి, ఇక్కడ ఈ హాలులో ఇంతమంది కూర్చున్నారు. అందరి దృష్టి స్వామిపైనే కేంద్రీకృతమై ఉంది. అందరి లక్ష్యం ఒక్కటే. అదేవిధముగా, మీరు నిరంతరం భగవచ్చింతన చేయాలి. సమాజసేవలో పాల్గొనాలి. పది దినములు పస్తుండినవానికి మంచి భోజనం లభిస్తే అతడు ఎంత ఆనందిస్తాడు! చెరువులలోను, బావులలోను నీరు కరువైనప్పుడు వరుసగా వర్షము కురిస్తే మనం ఎంత ఆనందిస్తాము! అదేవిధముగా, మనం చేసే సేవలు అందరికీ ఆనందం కలిగించేవిగా ఉండాలి. తిండి లేని వారికి తిండి పెట్టండి. ఎవరికేది అవసరమో దానిని అందించండి. సేవద్వారానే మీరు దివ్యత్వాన్ని పొంద గలరు. జీవితం చాలా విలువైనది. మానవులుగా పుట్టి మృగములవలె జీవితమును గడపకండి.

**ఆత్మయే ఆధారము, మిగిలినదంతా ఆధేయము**

విద్యార్థులైన మీరు మొట్టమొదట విద్య అంటే ఏమిటో అర్థం చేసుకోవాలి. అది అర్థం చేసుకోకుండా పుస్తకాలు చదివితే కలిగే ప్రయోజనమేమిటి! మీ అందరిలోనున్నది ఒకే ప్రాణము, ఒకే దివ్యత్వము. అట్టి మూలాధారతత్త్వమును ప్రధానంగా పెట్టుకోవాలి. అదే ఆత్మ. అదే 'నేను'. ఆత్మయే ఆధారము; మిగిలినదంతా ఆధేయము. ఆత్మను అందరూ చూడవచ్చును. అయితే, అందుకు తగిన ప్రయత్నం చేయాలి. మీరు పెద్దపెద్ద గ్రంథాలు చదువుతున్నారు. కాని, నిజంగా విచారణ చేస్తే, ఈ చదువులవలన మీరు కేవలం కఠినత్వమునే నేర్చుకుంటున్నారు. ప్రేమను పెంచుకోండి. ప్రేమ ఒక్కటి ఉంటే అందరూ మనకు స్నేహితులవుతారు. ప్రేమ లేకుండా ఏమి చేసినప్పటికీ, ఏమి చెప్పినప్పటికీ అంతా కృత్రిమంగానే ఉంటుంది. ప్రేమ లేక మనం ఉండి ప్రయోజన మేమిటి! నీవు నీ పొరుగువానిని ప్రేమించు. అతను తన పొరుగువానిని ప్రేమించాలి. ఈవిధంగా, ప్రేమను పెంచుకుంటూ పోవాలి. మనలో ఏమాత్రము ద్వేషము ఉండకూడదు. ఒకరితో ఒకరు కలసి మెలసి మెలగాలి. "సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్ర పాత్". అన్ని శిరస్సులూ, అన్ని నేత్రములూ, అన్ని పాదములూ భగవంతునివే! ఇట్టి ఏకత్వాన్ని గుర్తించి ప్రేమభావమును పెంచుకోవాలి. కాని, ఇప్పుడు ప్రేమనుకూడా మీరు లౌకిక భావాలతో చెడ్డగా మార్చుకుంటున్నారు. ప్రేమను ప్రేమగానే తీసుకోవాలి. అప్పుడే అందరం ఒక్కటవుతాము.

**ఎవరు గొప్ప?**

మన చేతికి ఐదు వ్రేళ్ళున్నాయి. ఇందులో అన్నీ అవసరమే. ఏ ఒక్కటి లేకపోయినా పని సక్రమంగా చేయడానికి వీలుకాదు. ఒకనాడు ఐదు వ్రేళ్ళూ తమలో తాము వాదించుకున్నాయి, 'ఎవరు మనలో గొప్ప?' అని.

బొటనవ్రేలు, "నేనే మీ అందరికంటే గొప్ప. నేను లేక ఎవరూ ఏ పనీ చేయలేరు", అన్నది. తక్షణమే చూపుడువ్రేలు నవ్విందట. "ఓ బొటనవ్రేలూ! నా సహాయం లేకుండా నువ్వు ఏమి చేయగలవు? 'వీరు ఫలానావారు, వారు ఫలానావారు' అని చూపించ డానికి అందరూ నన్నే ఉపయోగిస్తారు. కాబట్టి, నేనే గొప్ప", అన్నది. మధ్యవ్రేలు చెప్పిందట, "మీరెంత హాస్యాస్పదంగా మాట్లాడుతున్నారు! మీ అందరికంటే నేనే పెద్దవాడిని. మీరు నల్గురూ నాకు ఇరువైపుల ADCలు (అంగరక్షకులు)గా ఉన్నారు. కాబట్టి, నేనే గొప్ప". ఉంగరపు వ్రేలు చెప్పిందట, "అయ్యా, నీవు మాట్లాడేదికూడా చాలా హాస్యాస్పదంగా ఉన్నది. వజ్ర వైఢూర్య మరకత మాణిక్య గోమేధిక పుష్యరాగములు పొదిగిన బంగారు ఉంగరములు మొట్టమొదట నాకే అలంకరిస్తారు. కాబట్టి, నేనే మీ అందరికీ రాజును." కట్టకడపటికి చిటికెన వ్రేలు చెప్పిందట, "అయ్యా! దోషులను శిక్షించాలన్నా, ఎవరికైనా బుద్ధి చెప్పాలన్నా నేనే సైన్యాధిపతిగా ముందు పోతున్నాను. మీరు నన్ను అనుసరిస్తున్నారు. నేను మీ అందరికీ లీడర్‌ను. కాబట్టి, నేనే గొప్ప". అప్పుడు హృదయం మధ్యలో కలుగజేసుకొని, "పిచ్చివారలారా! మీరిలా పోట్లాడు కోవడం తగదు. మీరు ఐకమత్యంతో కలసి మెలసి పని చేసినప్పుడే ఏ కార్యమునైనా సాధించడానికి వీలవుతుంది. కాబట్టి, మీరందరూ గొప్పవారే!" అని బుద్ధి చెప్పింది. అప్పుడా ఐదు వ్రేళ్ళూ సిగ్గుతో తలలు వంచుకున్నాయి. **నిజంగా విచారణ చేస్తే, హృదయమే అన్నింటికంటే గొప్పది. దేహము, మనస్సు, బుద్ధి, చిత్తము ఇవన్నీ ఉపకరణములే తప్ప వేరు కావు.**

విద్యార్థులారా! ఎవరికి వారే గొప్ప. కాబట్టి, అనవసరమైన వాదోపవాదములతో కాలమును వ్యర్థం చేయకండి. అందరితో స్నేహంగా ఉండండి. దుష్ట శక్తులను అందరూ ఏకమై ఖండించండి. మన నిత్య జీవితంలో ఆచరించవలసిన ఆదర్శములెన్నో ఉన్నాయి. ఆ ఆదర్శములు పుస్తకములు చదివి నేర్చుకునేవి కావు; అవి మన హృదయంలోనే ఉన్నాయి.

### అందరి క్షేమంలోనే నీ క్షేమం ఇమిడి వుంది

ప్రతి ఒక్కరియందు 'నేను' అనేది సమంగా ఉన్నది. 'సాయిబాబా ఎవరు?' అంటే 'నేను' అంటాను. 'వైస్ ఛాన్సలర్ ఎవరు?' అంటే ఆయన 'నేను' అంటాడు. ఈ 'నేను' అనేదే ఆత్మ. అందరిలో వున్న ఆత్మ ఒక్కటే. 'ఏకమేవాద్వితీయం బ్రహ్మ'. ఈ సత్యాన్ని గుర్తిస్తే చాలు; ఇంకేమీ ఆధ్యాత్మికసాధనలు చేయనక్కర్లేదు. ఆధ్యాత్మిక మనగా మన నిజతత్త్వాన్ని మనం గుర్తించుకోవడమే! దేహాభిమానము అహంకారమునకు దారితీస్తుంది. అహంకారముచేత నీవు ఏమీ తెలుసుకోలేవు. అందరం ఒక్కటే. అందరి క్షేమంలోనే నీ క్షేమం ఇమిడి వుంది. ఆవిధమైన ఏకత్వాన్ని నీవు అభివృద్ధిపరచుకోవాలి. ఏకత్వం ఉన్నచోట పవిత్రత వస్తుంది. పవిత్రతనుండే దివ్యత్వం ఆవిర్భవిస్తుంది. వేదము అదే చెప్పింది:

**కలసి మెలసి తిరుగుదాం కలసి మెలసి పెరుగుదాం**
**కలసి మెలసి తెలుసుకున్న తెలివిని పోషించుదాం**
**కలసి మెలసి కలత లేక చెలిమితో జీవించుదాం**

నీ పుస్తకము ఇంకొకరికి ఇవ్వవు; ఇంకొకరికి ఏమాత్రం సహాయపడవు. ఈవిధంగా ఉంటే ఎట్లా? అందరూ ఏకం కావాలి. అప్పుడే ఆనందాన్ని అనుభవించగలరు. మీరు నేర్చుకోవలసినది ఒక్కటే ఒక్కటి – ప్రేమను పెంచుకోండి. ఆ ప్రేమ మీ దగ్గరా ఉంది; నాలోను ఉన్నది; ఎదుటివానియందుకూడా ఉన్నది. అందరి యందు నేను ప్రేమనే చూస్తాను. కనుక, అందరూ నాకు ఒక్కటే. మీరుకూడా అదే భావంతో మెలగండి. కేవలం పూజలు చేయడం ప్రధానం కాదు. అందరిలో ఉన్న 'నేను'ను నీవు ప్రేమించు. అది తెలుసుకోకుండా 'దేవుడా, దేవుడా' అనుకుంటూ కూర్చుంటే ప్రయోజనం లేదు. అందరూ ఒక్కటే. అందరిపట్ల సమభావంతో వర్తించాలి. All are one, be alike to everyone. ఇదే మీరు ముఖ్యంగా నేర్చుకోవలసినది.

ప్రేమస్వరూపులారా! మీరు చదివే చదువులతో పాటు ఏకత్వాన్ని అభివృద్ధిపరచుకోండి. ఇదొక గులాబీ పుష్పము. అనేక రేకలు చేరి గులాబీ అయింది. ఈ రేకలను ఒక్కొక్కటీ తీసివేస్తే ఏమీ మిగలదు. కాబట్టి, గులాబీలోని రేకలవలె మీరు కలసి మెలసి ఉండండి. మీ హృదయమే ఒక పుష్పము. దినాలు గడిస్తే గులాబీ రేకలు రాలిపోతాయి. కాని, హృదయమనే పుష్పము ఎప్పటికీ వాడిపోదు, రాలిపోదు. అట్టి హృదయాన్ని మీరు ఆధారం చేసుకోవాలి. మీరు నవగ్రహాలను పూజిస్తుంటారు. నవగ్రహాలు ఎంతో ఐకమత్యంతో, సమన్వయంతో తమ విధులను నిర్వర్తించడంచేతనే ఈ జగత్తు సుక్షేమంగా ఉన్నది. (భగవాన్ తమ దివ్యహస్త చాలనముచే ఒక

నవరత్నపుటుంగరాన్ని సృష్టించారు. "ఈ ఉంగరమును ఎవరు ధరించినప్పటికీ నవగ్రహాలు వారి వెంటనే ఉండి తగిన భద్రత కలిగిస్తాయి" అని పలుకుతూ శ్రీవారు ఆ ఉంగరమును ముఖ్య అతిథి జస్టిస్ వెంకటచలయ్యకు అనుగ్రహించారు).

ప్రేమస్వరూపులారా! ఏకత్వమును నేర్పే చదువు చదవండి. ఇక్కడ మీరు నేర్చుకున్న విషయాలను మీ హృదయంలో ప్రింటు చేసుకోండి. వాటిని ఆచరణలో పెట్టండి. అప్పుడే మీరు తగిన శాంతిని అనుభవిస్తారు. ప్రపంచములో ఎదురయ్యే కష్టనష్టములకు తట్టుకొని, నెట్టుకొని ముందుకు సాగిపోవడానికి తగిన బలమును మీరు సంపాదించుకోండి. మీ అందరికీ నా ప్రేమను, ఆశీర్వాదములను అందిస్తున్నాను. మీరందరూ ఐకమత్యంగా, ఆనందంగా కాలమును గడపండి. మీ తల్లిదండ్రులకు సుఖశాంతులను అందించండి. మీకు దేహము నిచ్చినవారు తల్లిదండ్రులు. కనుక, మొట్టమొదట వారికి మీరు కృతజ్ఞతలు తెలుపుకోండి. అప్పుడే మీరు చదివిన చదువు సార్థకమవుతుంది.

(2005 ఆగష్టు 17వ తేదీ ఉదయం సాయికుల్వంత్‌లో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)